ప్రజాశక్తి
మంగళవారం 17 అక్టోబర్ 2023   8 పేజీలు
ఎన్‌టిఆర్   కృష్ణా




ఇంద్రకీలాద్రిపై దర్శనానికి వచ్చిన సందర్శకులు



దసరా ఉత్సవాల వార్తలు 4వ పేజీలో

శ్రీ గాయత్రీ దేవిగా దుర్గమ్మ

కృష్ణా డిఆర్‌ఓగా రోజా



కలెక్టర్ రాజాబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డిఆర్‌ఓ పి.రోజా

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : కృష్ణా జిల్లా రెవెన్యూ అధికారిగా పెద్ది రోజా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు రెవెన్యూ అధికారిగా విధులు నిర్వహించిన పి.వెంకట రమణ బాపట్ల జిల్లాకు బదిలీ అయ్యారు. ఇటీవల జరిగిన డిప్యూటీ కలక్టర్ల బదిలీల్లో గుంటూరు నగర పాలక సంస్థలో అడిషనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న పెద్ది రోజాను కష్ణాజిల్లా రెవెన్యూ అధికారిగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈనేపథ్యంలో పి.రోజా సోమవారం కలెక్టర్ పి.రాజాబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం తన ఛాంబర్లో డిఆర్‌ఓగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిసి ఆమెకు అభినందనలు తెలిపారు.

సామాన్యులకు సంతృప్తికర దర్శనమే లక్ష్యం : కలెక్టర్ ఢిల్లీరావు వార్త 6లో

సెలవుల్లో హాజరు కాకపోతే

జీతం కట్

- టీచర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలు
- వర్క్‌ షాపులకు హాజరు కావాలని యాజమాన్యాలు హుకుం
- గుట్టుచప్పుడు కాకుండా తరగతుల నిర్వహణకు కార్యాచరణ
- మానసిక ఆందోళనలో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను పెడచెవిన పెట్టి గుట్టుచప్పుడు కాకుండా దసరా సెలవుల్లోనూ ఉపాధ్యాయులను రప్పించేందుకు, తరగతులు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. దసరా సెలవుల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తే బహిర్గత మవుతుందన్న ఉద్దేశంతో ఉపాధ్యాయులపైకి దృష్టి మళ్లించారు. ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణా తరగతులు, వర్క్‌షాపులు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. సోమవారం నుంచి



నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు

సివి రేణుక, ఎన్‌టిఆర్ జిల్లా విద్యా శాఖాధికారి

ప్రభుత్వ నిబంధలన ప్రకారం ప్రైవేటు విద్యా సంస్థలు నడుచుకోవాలి. నిబంధనలను పెడచెవిన పెడితే చర్యలు తప్పవు. సిలబస్ పూర్తి కాలేదనే నెపంతో తరగతులు, స్టాఫ్ మీటింగ్‌లు, వర్క్ షాపులు, రిజిస్ట్రేషన్ వర్కులు నిర్వహిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటాం.

బుధవారం వరకు మూడో కింటికి తెలియకుండా వీటిని నిర్వహించేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిసింది. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 517 ప్రైవేటు పాఠశాలలున్నాయి. వీటిల్లో 1.97 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. దాదాపు 30వేల మందికిపైగా టీచర్లు ప్రైవేటు సంస్థల్లో పని చేస్తున్నారు. విజయవాడ నగరంలోనే అధికంగా ప్రైవేటు విద్యా సంస్థలున్నాయి. వీటి సంఖ్య సుమారు 255 వరకు ఉంటుంది. నగరంలోని ప్రైవేటు యాజమాన్యాలే ఇలాంటి నిబంధనలకు విరుద్ధమైన కార్యక్రమాలకు కార్యాచరణ రూపొందించుకున్నట్లు సమాచారం. గతంలో కూడా ఇలానే వ్యవహరించాయనే విమర్శలు ఉన్నాయి. ఇదిలా ఉంటే పనితీరు సాకుగా చూపి టీచర్లను యాజమాన్యాలు మానసిక ఒత్తిళ్లకు గురి చేస్తున్నాయి. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధనలు చేయడం లేదని, బోధనా తీరును మెరుగు

(మిగతా 6లో)

కూలి గోప్యం...వసతి శూన్యం

ఇదీ దసరా ఉత్సవాల్లో పారిశుధ్య కార్మికుల దుస్థితి



ప్రజాశక్తి - విజయవాడ : దుర్గమ్మ దసరా శరన్నవరాత్రి ఉత్సవాల తొలి రోజు నుంచే కార్మికులకు పారిశుధ్య నిర్వహణ కాంట్రాక్టర్ చుక్కలు చూపిస్తున్నాడు. విధి నిర్వహణలో ఉన్న కార్మికులకు కనీసం మంచినీరు, భోజనం, వసతి, మరుగుదొడ్ల వంటి సదుపాయం అందుబాటులో లేకపోకపోవడంతో ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన వలస కార్మికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈనెల 25వ తేదీ వరకు పారిశుధ్య పనులను చేయాల్సిన కార్మికులు.... ప్రస్తుతం నెలకొన్న ఇబ్బందికర పరిస్థితుల నుంచి బయటపడి అప్పటి వరకు ఎలా పని చేయాలోనని తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దుర్గగుడి దిగువ పరిసర ప్రాంతాలతోపాటు పద్మావతి ఘాట్, కృష్ణవేణిఘట్, దుర్గాఘాట్ తదితర 25 ప్రాంతాల్లో వెయ్యి మంది కార్మికులతో పారిశుధ్య నిర్వహణకు విజయవాడ నగరపాలక సంస్థ టెండరు పిలిచింది. వన్‌టౌన్‌కు చెందిన పోతిన నరసింహారావు అనే వ్యక్తి కాంట్రాక్ట్‌ను చేజిక్కించుకున్నాడు. అయితే టెండర్ నిబంధనల్లో పేర్కొన్నట్లు కార్మికులను పూర్తి స్థాయిలో తీసుకురావడంగానీ, తీసుకొచ్చిన కార్మికులకు కనీస వసతి చూపడంగానీ చేయలేదు. గుంటూరు, ప్రకాశం, శ్రీకాకుళం, పల్నాడు జిల్లా, బాపట్ల తదితర జిల్లాల నుండి సుమారు 400 మంది వరకు కార్మికులను కాంట్రాక్టర్ తీసుకొచ్చినట్లు సమాచారం. మిగిలిన 600 మంది కార్మికులను

(మిగతా 6లో)



సావిత్రమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆశా కార్యకర్తకు నివాళి

ప్రజాశక్తి - మైలవరం : మండలంలోని చంద్రాల పిహెచ్‌సిలో పనిచేస్తున్న పొందుగుల గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త సావిత్రమ్మ (54) అనారోగ్యంతో ఆదివారం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మరణించారు. సోమవారం పొందుగల గ్రామంలోని ఆమె స్వగహం వద్ద మృతదేహాన్ని సిఐటియు నాయకులు ఆశా కార్యకర్తలు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పత్తిపాటి జ్యోతి, సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ సుధాకర్‌లు మాట్లాడుతూ 20 ఏళ్లకు పైగా ఆశ వర్కర్‌గా విధులు నిర్వహిస్తూ అందరి మన్ననలు సావిత్రమ్మ పొందిందన్నారు. ప్రభుత్వం తీసుకొస్తున్న వివిధ పథకాల తో ఆశాలపై ఒత్తిడి పెంచి పనిచేస్తున్నారన్నారు. ఆ ఒత్తిడికి తట్టుకోలేక కొంతమంది మరణిస్తున్నారని ఆశలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సావిత్రమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశాలు ప్రశాంతి, శైలజ, కళ్యాణి, లావణ్య పీహెచ్సీ పరిధిలోని పలువురు ఆశాలు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో పలు శిక్షణలు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం: రెడ్డిగూడెం శాఖా గ్రంథాలయంలో దసరా సెలవుల సందర్భంగా పాఠశాల విద్యార్థులచే కథల పుస్తకాలు చదివించి, చెప్పించినట్లు గ్రంథాలయ అధికారి టి.వెంకటేశ్వర రావు తెలిపారు. తదుపరి విద్యార్థులతో డ్రాయింగ్, కబాడీ ఆటలు ఆడించడ మైనదని ఆయన తెలిపారు. **విజయవాడ :** విజయ వాడ సత్య నారాయణ పురంలోని చిత్తరంజన్ గ్రేడ్-2 శాఖా గ్రంథాలయం సత్య నారాయణపురంలో దసరా సెలవుల సందర్భంగా పలు కార్య క్రమాలు నిర్వహిం చారు. నీతి కథలు చెప్పడం, చదివించడం, పుస్తక సమీక్షలు, శ్లోకాలలో శిక్షణ ఇచ్చారు. ఆర్.శ్రీనివాసరావులు రిటైర్డ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి స్పోకెన్ ఇంగ్లీషులో శిక్షణ ఇచ్చారు. విద్యావేత్త బి.వినోద్‌కుమార్ జికెలో శిక్షణ ఇచ్చారు. చిత్రలేఖనం, డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధిదకారి పి.సంపత్‌కుమార్, రికార్డు అసిస్టెంట్, కెకె.ప్రణీత, వాలంటీర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.



విజయవాడ సత్యనారాయణపురం గ్రంథాలయంలో...

నిఘంటువును నిరంతరం చూడాలి

ప్రజాశక్తి - తిరువూరు : నిఘంటువును ఒక పాఠ్య పుస్తకంలా భావించి, నిరంత రం చూడటం అలవాటు చేసుకోవాలని ఆంగ్ల భాషా ఉపాధ్యాయ సంఘ కన్వీనర్ ఎం.రాంప్రదీప్ సూచించారు. సోమవారం నిఘంటువు దినోత్సవం సందర్భంగా గానుగపాడులో ఆయన పర్యటించి రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పంపిణీ చేసిన ఆంగ్ల నిఘంటువులపై దసరా సెలవుల్లో అవగాహన పెంచుకోవాలని తెలిపారు. నిఘంటువును నిరంతరం చూడటం వల్ల ఆంగ్ల భాష పదాలపై పట్టు వస్తుందని ఆయన విద్యార్థులకు వివరించారు.

నూతన సిఐ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సిఐ)గా షేక్ అబ్దుల్ నబీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఆయన్ను ఎస్‌పి తిరువూరుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు సిఐగా పనిచేసిన బంగారు రాజును విఆర్‌కు పంపారు.



ప్రజా రక్షణభేరి సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - వీరులపాడు : సిపిఎం మండల కమిటీ విస్తృత స్థాయి సమావేశం వీరులపాడులో మండల కమిటీ సభ్యులు షేక్ లాల్ అహ్మద్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్‌సిహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు పూర్తిగా విఫలం చెందాయని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశానికి అంటుతున్నాయని పేర్కొన్నారు. పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు నియంత్రించడంలో బిజెపి ప్రభుత్వం విఫలమైం దన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట కళ్యాణ్ మాట్లాడుతూ పలు సమస్యలపై నవంబర్ 15న జరిగే ప్రజా రక్షణ భేరి యాత్రను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చాట్ల.రవి సిపిఎం నాయకులు పల్లెకంటి బాబు, కోడూరు పిచ్చేశ్వరావు, హరిబండ్ల ఆనందరావు, ప్రభాకర్, పాల్గొన్నారు.

శానిటరీ కార్యాలయానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : స్థానిక 44 డివిజన్ సమగ్ర అభివద్ధికి అహర్నిశం కషి చేస్తున్నట్లు 44 డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి చెప్పారు. సోమవారం 44వ డివిజన్‌లోని లేబర్ కాలనీ హైస్కూల్ వెనుక ఉన్న ఖాళీ స్థలంలో శానిటరీ కార్యాలయం నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రత్నకుమారి మాట్లాడుతూ డివిజన్‌లో శానిటేషన్ పనులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా ఇక్కడ శానిటరీ కార్యాలయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. కొండ ప్రాంతాలలో మెట్లు, రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి, మిగిలిన ప్రాంతంలో సైతం పారిశుద్యం కోసం కషి చేస్తున్నట్లు ఆమె వివరించారు.

మండలాల్లో ఆరోగ్య సురక్ష శిబిరాలు

ప్రజాశక్తి - మైలవరం : మైలవరంలోని సచివాలయం1 పరిధిలో జగనన్న ఆరోగ్య ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం స్థానిక శాసనసభ్యులు వసంత కష్ణప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 172 రకాల మందులను అందుబాటులో ఉంచి అవసరమైన వారికి ఉచితంగా అందజేస్తున్నామన్నారు. **కంచికచర్ల :** కంచికచర్ల మండలం కీసర గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు వైద్య శిబిరం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పేరం నర్సమ్మ, వైస్.ఎంపిపి బండి మల్లిఖార్జన్ రావు, జడ్‌పిటిసి వేల్పుల ప్రశాంతి, ఇఒపిఆర్‌డి శ్రీనివాస్ వైసిపి నాయకులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట :** మండలంలోని గండ్రాయి గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంను గ్రామ సర్పంచ్ కొత్తపల్లి లూర్దు మేరీ ప్రారంభించారు. ఈ సందర్భంగా రోగులను పరామర్శించారు. వివిధ స్టాల్స్‌ను పరిశీలించారు. పోషకాహార ప్రదర్శన తిలకించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లూర్దు మేరీ మాట్లాడారు. డుతూ మారుమూల గ్రామాల్లో సైతం మండలానికి ఒక గ్రామం చొప్పున ప్రతిరోజూ వైద్య శిబిరాలు జరుగుతున్నాయన్నారు. సాధారణ వ్యాధులతో పాటు కంటి పరీక్షలు, ప్రాణాంతక వ్యాధి అయిన టీబీ, లెప్రసీ టెస్టులు ప్రత్యేకంగా చేపడుతున్నారన్నారు. **నందిగామ :** నందిగామలో 9వ వార్డు సచివాలయం వద్ద 17,18 వార్డుల్లో జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని నందిగామ మున్సిపల్ కమిషనర్ డా.ఎస్.జయరాం సోమవారం తెలిపారు.

వైసిపి పాలనలో కార్మికులకు ఉపాధి కరువు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : వైసిపి ప్రభుత్వ పాలనలో ఉపాధి దొరక్క సామాన్య ప్రజలు అల్లాడుతున్నారని జనసేన నగర అధ్యక్షులు పోతిన మహేష్ విమర్శించారు. సోమవారం ఇంటింటికి రాబోయే జనసేన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 48వ డివిజన్ అధ్యక్షులు కొరగంజి వెంకటరమణ ఆధ్వర్యంలో ఆంజనేయవాగు బయట నుంచి ప్రారంభించి కొండ ప్రాంతంలో పర్యటించారు. అక్కడ భవన నిర్మాణ కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను తెలసుకున్నారు. పనులు లేక ఇల్లు గడవక తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో జీవితం గడుపుతున్నామని కార్మికులు వాపోయారు. దీనిపై మహేష్ మాట్లాడుతు జగన్ ప్రభుత్వాన్ని గద్దెదింపితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. 48వ డివిజన్ అధ్యక్షులు కొరగంజి వెంకటరమణ మాట్లాడుతూ గత 60 రోజులు నుంచి జనసేన పార్టీ తరపున అచ్చంగా కొండ ప్రాంతంలో తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకున్నామన్నారు. అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. చాల చోట్ల పెన్షన్లు తొలగించారని, కరెంట్ స్తంభాలు ఒరిగిపోయి ప్రమాదభరితంగా వున్నాయని అన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - కంచికచర్ల : మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావు అన్నారు. కంచికచర్ల మండలంలోని కీసర గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ద్వారా 10 మంది ఎస్‌టి మహిళలకు ఉచిత కుట్టు మిషన్లను సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందన్నారు. సర్పంచ్ పేరం నర్సమ్మ, వైస్ ఎంపిపి బండి మల్లిఖార్జన్‌రావు, ఉప సర్పంచ్ చలమల ప్రభాకర్, జడ్పీటీసీ వేల్పుల ప్రశాంతి, ఎంపిడిఒ కె.శిల్ప, ఇఒపిఆర్డీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎంఎల్‌ఎ జగన్మోహన్‌రావు

సాగర్ జలాల ద్వారా నీరివ్వాలి

రైతు, కౌలు రైతు సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - నందిగామ : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం నందిగామ రెవిన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద రైతులు, కౌలు రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు మాట్లాడుతూ నెల రోజులుగా తీవ్ర వర్షాభావం వల్ల నందిగామ, చందర్లపాడు తదితర మండలాల్లో సాగునీరు లేక ప్రతి, మిర్చి మాగాణి, అపరాల పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయని తక్షణమే సాగునీరు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కష్ణా నది జలాలను మన వాటాగా వాడుకోవలసిన 200 టిఎంసిల నీటిని తెలంగాణ రాష్ట్రం తరలించుకుపోయిందని, రాష్ట్ర ప్రభుత్వానికి సాగునీటి వసతులు కల్పించే దాంట్లో చిత్తశుద్ధి లేదని పేర్కొన్నారు. నందిగామ ప్రాంతంలో 17వేల ఎకరాల ఆయకట్టు ఉన్న వేదాద్రి-కంచల ఎత్తిపోతల పథకం నాలుగు సంవత్సరాల నుండి పనిచేయక మూలన పడిందని అన్నారు. చెరువు మాధవరం ట్యాంకు నుండి 100 క్యూసెక్కుల నీటిని కిందకు విడుదల చేసి వాణిజ్య పంటలు పండించే రైతన్న ఆదుకోవాలని ప్రభుత్వాధికారులను కోరారు. కంచల -ఏటూరు మేజర్ కాలవ పరిధిలో సుమారు 17000 ఎకరాలకు పైగా సాగు విస్తీర్ణం ఉందని ఎకరానికి రూ.50 వేల నుండి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. నందిగామ రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం నందిగామ ఎన్‌ఎస్పి కార్యాలయం చేరుకొని సాగర్ నీరు విడుదల చేయాలని నిరసన తెలిపారు. నందిగామ ఎన్‌ఎస్‌పిడిఇ సుబ్బారావుతో ఫోన్లో మాట్లాడారు. వేదాద్రి కంచల ఎత్తిపోతల పథకం మరమ్మతులకు 7.3 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని ఒకటి రెండు రోజుల్లో టెండర్ ద్వారా పనులు చేపడతామని త్వరలో సాగర్ జలాలు విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు యర్రా శ్రీనివాసరావు, కర్రి వెంకటేశ్వరావు, చల్లారి బుజ్జి, ఆదినారాయణ, రామారావు, రాయుడి వెంకటేశ్వరరావు తదితల్లి పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు

సర్వేనెంబర్ 9లో పరిశీలన

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం గ్రామం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 9లో సోమవారం రెవెన్యూ అధికారులు పర్యటించారు. ఈ సర్వే నెంబరు గల భూములకు డి పట్టా, పాస్ పుస్తకాలు ఉన్నప్పటికీ ఆన్లైన్‌లో సదరు సర్వే నెంబర్లు కనిపించకపోవడంతో సంబంధిత రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆరో తేదీన రెడ్డిగూడెం వచ్చిన కలెక్టర్ డిల్లీరావుకు, ఎమ్మెల్యే వసంత వెంకట కష్ణ ప్రసాదుకు రెడ్డిగూడెం వైస్ ఎంపిపి చాట్ల రాబర్ట్ వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్, ఎమ్మెల్యే మూడు వారాల్లో సర్వే టీం ద్వారా సమస్య పరిష్కారం చేస్తామని చెప్పిన మాట ప్రకారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎస్.కిషోర్‌చంద్ర, విఆర్ఒ జ్యోతి, వైస్ ఎంపిపి చాట్ల రాబర్ట్, రైతుల భూములను పరిశీలించారు.

సమన్వయ కమిటీలో సౌమ్య

ప్రజాశక్తి- నందిగామ : జనసేన పార్టీతో సమన్వయం కోసం మిత్ర పక్షం తెలుగుదేశం పార్టీ నియమించిన అయిదుగురు సభ్యుల కమిటీలో మన నందిగామ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకురాలు, మాజీ శాసన సభ్యులు తంగిరాల సౌమ్యని నియమించడం శుభపరిణామం అని జనసేన నాయకులు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో సమన్వయం చేసుకునే అవకాశం నందిగామ నాయకురాలికి దక్కడం విశేషమని నియోజకవర్గ జనసేన నాయకులు కామిసెట్టి వెంకటేశ్వర రావు, పూజారి రాజేష్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

బాల్యవివాహాలను అడ్డుకోవాలి

ప్రజాశక్తి - వీరులపాడు : బాల్య వివాహాలను అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎపిఎం యెహెూషువ పేర్కొన్నారు. వీరులపాడు వెలుగు కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు, డ్వాక్రా మహిళలతో బాల్య వివాహాలపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహ రహిత నిర్మాణ సమాజంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళలతో బాల్య వివాహాలను అరికట్టడం అందరూ బాధ్యతని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : రైతులు సాగుచేస్తున్న పంటలకు సాగునీరు వెంటనే అందించాలని మాజీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ డిమాండ్ చేశారు. మండలంలోని ముండ్లపాడు గ్రామ పరిధిలోని సాగునీరు అందక ఎండిపోతున్న పంటలను రైతులతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది మొదట్నుంచీ వర్షాలు లేకపోవడం, సాగర్ జలాలు అందకపోవటం వల్ల పంటలు ఎండి పోతున్నాయని రైతులు పలుమార్లు తన దృష్టికి తీసుకువచ్చారని, సాగునీరు లేక రైతులు సాగు చేస్తున్న పంటలు అధ్వానంగా ఉన్నాయన్నారు.

ప్రభుత్వ ఖాజీగా షేక్ పెద నాగుల్

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఎన్నో సంవత్సరాలుగా దాములూరు కాచవరం గ్రామాలకు వంశపారంపర్య నాయబ్‌గా సేవలందిస్తున్న షేక్ పెదనాగులను ప్రభుత్వ ఖాజీగా నియమించారు. ఈ సందర్భంగా సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో గ్రామస్తులు ముస్లిం మత పెద్దలు నాగుల మీరాను ఘనంగా సన్మానించారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని దాములూరు, చిలుకూరు, కాచవరం, కేతనకొండ, మూలపాడు, కోటికలపూడి, జూపూడి గ్రామాలకు సంబంధించిన నియామక పత్రం ఆయన అందుకున్నారు.



ప్రజా బ్యాలెట్ నిర్వహిస్తున్న వామపక్ష నేతలు

విద్యుత్ భారాలపై తీవ్ర వ్యతిరేకత

వామపక్షాల ఆధ్వర్యంలో ప్రజా బ్యాలెట్ నిర్వహణ

ప్రజాశక్తి-చల్లపల్లి: విద్యుత్ భారాలపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. పెరిగిన విద్యుత్ ఛార్జీలపై సోమవారం స్థానిక సంత బజారు బజార్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో ప్రజా బ్యాలెట్ నిర్వహించారు. మొత్తం 650 మందికి ప్రజా బ్యాలెట్‌లో పాల్గొనగా 644 విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా, ఆరుగురు అనుకూలంగా విద్యుత్ ఛార్జీలపై తమ స్పందనను తెలియజేశారు. ఈ సందర్భంగా వామపక్ష నేతలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై సర్దుబాటు ఛార్జీల పేరుతో కోట్లాది రూపాయలు భారం మోపిందని విమర్శించారు. ట్రూ అప్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటలు రద్దు చేయాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేసారు. ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ ఛార్జీలు తగ్గినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం రకరకాల పేర్లతో ప్రజలను మభ్యపెట్టి విద్యుత్ ఛార్జీలు వసూలు చేస్తున్నాయని విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు, మండల కమిటీ సభ్యులు మహమ్మద్ కరీముల్లా, బండారు కోటేశ్వరావు, లంకపల్లి సత్యం, మేడేపల్లి వెంకటేశ్వరరావు, గోళ్ల సాంబశివరావు, బళ్ల వెంకటేశ్వరరావు, వాకా రామచంద్రరావు, సిపిఐ జిల్లా ఉపాధ్యక్షులు అడ్డాడ ప్రసాద్, జిల్లా నాయకులు హనుమాన్ల సురేంద్రనాథ్ బెనర్జీ, మాలెంపాటి వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు మిక్కినేని మధు, ఎంపీటీసీ సభ్యులు మాలెంపాటి శ్రీనివాసరావు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు షేక్ నబీ గోరి, నాయకులు వేముల చిన్న, విశ్రాంత ప్రిన్సిపల్ రామారావు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న విఆర్ఎలు

ఉద్యోగోన్నతి కల్పించాలని విఆర్ఎల వినతి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జిల్లాలో అర్హత కలిగిన గ్రామ రెవెన్యూ సహాయకులకు పదోన్నతులు కల్పించాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాధిత సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం కృష్ణాజిల్లా కమిటీ అధ్యక్షులు బొడ్డు వెంకటరత్నం మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా తాము వీఆర్‌ఏలుగా పనిచేస్తున్నామని, వీఆర్వో, అటెండర్, చైన్ మాన్ వంటి పదోన్నతులు రోస్టర్ పద్ధతి లేకుండా సీనియార్టీ ప్రకారం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ విషయమై సంయుక్త కలెక్టర్ సంబంధిత అధికారులను పిలిపించి అర్జీల పరిష్కారంపై సత్వరమే చర్యలు తీసుకోవాలని సూచించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సంఘ నాయకులు జీవి నాగేశ్వరరావు, సిహెచ్ ప్రసాద్, బి.ఏసుబాబు, కే.రాంబాబు తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాహారాలు కలిగిన పదార్థాలను వినియోగించుకొని ప్రజలు ఆరోగ్యకరంగా జీవించాలని ఎంపీడీవో దారపు శ్రీనివాస్ కోరారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా గుడివాడ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మండలంలోని కవుతరం సెక్టర్ పరిధిలో సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారాఅందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భవతులు, బాలింతలు చిన్నారులు సద్వినియోగం చేసుకోని ఆరోగ్యకరంగా జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ అబ్దుల్ రెహమాన్ మస్తానా, డిప్యూటీ తాసిల్దార్ కనకదుర్గ, డాక్టర్ యశస్వని, డాక్టర్ శ్రావ్య, ఐసిడిఎస్ సూపర్వైజర్ వాణి, పిఓపిఆర్టి దిలీప్ కుమార్, అంగన్వాడీ కార్యకర్తలు రజని, శశి, టి నాగమణి, మంగయమ్మ, చాముండేశ్వరి, కె నాగమణి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

సాగు నీరందించాలని వినతి



ప్రజాశక్తి-కోడూరు: ఖరీఫ్ సీజన్ సంబంధించి కోడూరు మండలంలో సుమారు 30 వేల ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేస్తున్నారని, రైతులు పంటను సకాలంలో సాగుచేసినా పూర్తిస్థాయిలో సాగునీరు అందకపోవడంతో, వరి పంట ఎండిపోవడంతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో నారుమడులు చనిపోతున్నాయని, తీర ప్రాంత గ్రామాల్లో నారుమడులు పోసుకుందామంటే సాగునీరు రాక రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు బండ్రెడ్డి రామకష్ణ అన్నారు. సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా కోడూరు మండల సమస్యలపై జెసి అపరాజిత సింగ్‌కు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కాలువలకు పూర్తిస్థాయిలో సాగునీరు లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. వంతుల వారి విధానంతో సాగునీరు అందిస్తున్నారని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నప్పటికీ అది అమలు కావడం లేదని, కాలవలకు తగినంత నీరుని విడుదల చేయలేకపోతున్నారని ఆయన అన్నారు. తీర ప్రాంత గ్రామాలైన రామకృష్ణారావు, హంసలదీవి, ఉల్లిపాలెం, మందపాకల, పోటుమీద, పిట్టలంక, సాలెం పాలెం, వేణుగోపాలపురం, విశ్వనాధపల్లి గ్రామాలకు సాగు నీరు సరిపడనంత సాగునీరు లేకుండా పోతుందని, దీంతో రైతంగం తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, ఇప్పటికే రైతులంతా కూడా ఎకరానికి 25 వేల రూపాయలు ఖర్చుపెట్టి ఉన్నారని, తక్షణమే రైతులకు కావలసిన విధంగా సాగు నీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి అక్కల రామ్మోహన్ రావు (గాంధీ), కోడూరు మండల అధ్యక్షులు మర్రే గంగయ్య, ఉమ్మడి కష్ణా జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి కొండవీటి సునీత, పిట్టలంక గ్రామ సర్పంచ్ కనకాల వెంకటేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు లంకె భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరులో కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి-ఉయ్యూరు: జిల్లా కలెక్టర్ పి రాజాబాబు సోమవారం ఉయ్యూరు మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి మున్సిపాలిటీ పరిధిలో పన్నుల వసూళ్లు అభివృద్ధి పనుల గురించి ఆరా తీశారు. మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్ను, ఆస్తి పన్ను,ఖాళీ స్థలాల పన్నులు నూరు శాతం వసూళ్లు జరగాలన్నారు. ఆదాయ



వనరులు పెంపొందించుకుని స్వయం సమద్ధి సాధించాలని అభివద్ధిలో ముందడుగు వేయాలని సూచించారు. ఉయ్యూరు మున్సిపాలిటీలో శానిటేషన్ మెరుగుపరిచేందుకు మున్సిపాలిటీ అవసరాలకు కంపాక్టర్ వాహనం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఉన్నతాధికారులకు లేఖ వ్రాసి సమకూర్చుకోవాలని కమిషనర్ కు సూచించారు. ఈ వాహనం ద్వారా సేకరించిన చెత్త క్రషింగ్ చేసి జిందాల్ కంపెనీకి ఉదయం సాయంత్రం రెండు ట్రిప్పులు చేరవేసేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. తద్వారా మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్తుందన్నారు. ఉయ్యూరు మున్సిపాలిటీ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, పార్టీ పట్టణ అధ్యక్షులు అబు కలాం మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు, అభివృద్ధిపై చర్చ

ప్రజాశక్తి-గుడివాడ: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వ సభ్య సమావేశం ఎంపిపి గద్దె పుష్పరాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతో రివ్యూ నిర్వహించి మండలం స్థాయి నుండి గ్రామ స్థాయి వరుకు జరిగిన వివిధ అభివద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారానికై తీసుకోవలసిన చర్యల పై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో జి.వెంకటరమణ, జడ్‌పిటిసి సభ్యులు గోళ్ళ రామకష్ణ, మార్కెట్ యార్డు చైర్మన్ మట్టా నాగమణి, మండలంలోని ఎంపిటిసి, సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం): ఉంగుటూరు మండలం పెద్దవుటపల్లి సెయింట్. జార్జ్ ఆర్సీమ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సోమవారం సైన్స్ ఫెయిర్ నిర్వహించడం జరిగింది.



విద్యార్థులలో ఉన్న నైపుణ్యం వెలికి తీయటానికి ఇటువంటి విజ్ఞాన ప్రదర్శనలు దోహదం చేస్తాయని ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రతిమ శ్యామల అన్నారు. విద్యార్థుల పాఠ్యంశాలలోని వైజ్ఞానిక, భౌతిక శాస్త్ర విభాగాల నుండి విద్యార్థులచే ఏర్పాటు చేసిన వివిధ రకాల అంశాలు తల్లిదండ్రులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల పరికరాలు, వివరించిన విధానం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాణావతు తిరుపతమ్మ, ఉపసర్పంచ్ మూల్పూరు శివసాయి ప్రసాద్,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బాలలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-చల్లపల్లి

నిరుపేద ఎస్టీలను ఎప్పటికప్పుడు పట్టించుకుంటూ వారి పిల్లల విద్యాభివద్ధికి కషి చేస్తున్న గ్రామ వాలంటీర్ సురేఖను అభినందించారు.ముందుగా డిప్యూటీ సీఈఓ గంజి శ్రీనివాసరావు 25 మంది నిరుపేద ఎస్టీ బాలలకు నూతన వస్త్రాలు బహుకరించారు. కార్యక్రమంలో పంచాయితీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, సచివాలయ కార్యదర్శి తిరువీధుల రాజశేఖర్, వికాస కేంద్రం ట్రస్ట్ సభ్యులు అడ్డాడ ప్రసాద్ బాబు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-తోట్లవల్లూరు: మండలంలోని ఐలూరు గ్రామానికి చెందిన తుళ్లూరు రామలింగేశ్వరరావు (55) కుటుంబ కలహాలతో ఉరివేసుకొని మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం రామలింగేశ్వరరావుకి తన అక్క మల్లేశ్వరి కూతురు శ్రీ లక్ష్మితో 25 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. అప్పటినుండి విజయవాడ ఆటోనగర్ లోని సిరీస్ కంపెనీలో వెల్డర్‌గా పనిచేసేవాడు. కుమారుడు పవన్ ప్రజ్ఞ తేజ బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. భార్యతో గొడవలు తరచూ జరగడం వల్ల రెండు సంవత్సరాల క్రితం విడిపోయి ఇద్దరూ విడివిడిగా ఉంటున్నారు. రామలింగేశ్వరరావు కి ఉన్న రెండు ప్లాట్లు భార్య శ్రీలక్ష్మి పేరుతో రాయించుకుని అడిగితే తనకేమి సంబంధం లేదని మోసం చేసిందని, ఏకాకిని చేసి పట్టించుకోవడంలేదని, తాను చనిపోతున్నానని తన చావుకి తన అక్క మల్లేశ్వరి, భార్య శ్రీలక్ష్మి, కొడుకు పవన్ కారణమని సూసైడ్ నోట్ రాసి సెల్ఫీ వీడియో తీసుకుని ఉరి వేసుకుని చనిపోయాడు. ఈ సెల్ఫీ వీడియోలను తన అన్న శ్రీనివాసరావు కొడుకుకు పంపించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



వికలాంగుల నుంచి స్పందన అర్జీలను స్వీకరిస్తున్న జెసి

బాల్య వివాహాల నిరోధానికి చర్యలు : జెసి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా నిరోధించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత తీసుకోవాలని సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ జిల్లా అధికారులకు సూచించారు. రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ సీఈవో ఏఎండి ఇంతియాజ్ మంగళగిరిలోని సీసీఎల్ఏ కార్యాలయం నుండి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్వయం సహాయక సంఘాల మహిళ సభ్యులతో ఆన్లైన్లో బాల్య వివాహ రహిత భారతదేశం అనే నినాదంతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ నగరంలోని కలెక్టరేట్ స్పందన సమావేశం నుండి పాల్గొని మాట్లాడుతూ బాలికలకు బాగా చదువు చెప్పించడమే మనం వారికి ఇచ్చే గొప్ప బహుమతన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిందని, ప్రామాణికంగా అనుసరించే విధానాలను రూపొందించిందన్నారు. చాలామంది చిన్న పిల్లలకు ఇష్టం లేకున్నా వారి తల్లిదండ్రులు వివాహం చేస్తున్నారన్నారు. బాలికల్లో ఎంతో ప్రతిభ ఉన్నప్పటికీ అది గుర్తించక వారికి చదువు చెప్పించక బాల్యంలోనే వారి తల్లిదండ్రులు వివాహం చేస్తున్నారన్నారు. బాలికలకు చదువు చెప్పించి ఉద్యోగం వచ్చాక వివాహం చేయాలని హితవు పలికారు. బాలికలు బాగా చదువుకొని స్వయం శక్తి సాధించాలని ఆర్థికంగా ఎదగాలన్నారు. బాలికలకు పెళ్లి చేస్తే వారికి సరైన శరీర అభివద్ధి లేక రక్తహీనత వంటి సమస్యలు ఉంటాయన్నారు. బాల్య వివాహరహిత జిల్లాగా తీర్చిదిదేందుకు ప్రతి ఒక్కరు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పీడీ పిఎస్ఆర్ ప్రసాద్, ఆర్‌డిఒ శివ నారాయణరెడ్డి, ఐసిడిఎస్ పీడీ సువర్ణ పాల్గొన్నారు.

స్పందన అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

స్పందన అర్జీలను ప్రత్యేక శ్రద్ధతో సకాలంలో పరిష్కరించాలని సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంయుక్త కలెక్టర్, డిఆర్ఓ పి వెంకటరమణ, మచిలీపట్నం ఇంఛార్జి ఆర్డిఓ శివనారాయణరెడ్డిలతో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించి విజ్ఞాపన పత్రాలు స్వీకరించారు. జెసి మాట్లాడుతూ ప్రజలు దూర ప్రాంతాల నుండి స్పందనకు వస్తుంటారని అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు వికలాంగులు అర్జీలు తీసుకొని రావడంతో సంయుక్త కలెక్టర్ గమనించి వెంటనే వేదిక పైనుండి వారి వద్దకు వచ్చి వారి దరఖాస్తులను స్వీకరించి, వారి సమస్యలను ఆలకించి వాహనాలు నడపడానికి వీరికి పిట్ నేస్ ఎలా ఉందో పరిశీలించాలని జిల్లా ఆసుపత్రి కో ఆర్డినేటర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అవనిగడ్డ: శీతాయిలంక వద్ద కెఈబీ కెనాల్‌లో శనివారం స్నానానికి వెళ్లి మరణించిన బాలుర కుటుంబాలకు శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు తోట శ్యామ్ కిషోర్ నాయుడు ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం శ్యామ్ కిషోర్ నాయుడు సింహాద్రి కాలనీలోని బాధిత రెండు కుటుంబాలకు రూ.5 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రేమాల శ్రీనివాసరావు, పండు, సముద్రాల శ్రీను, బుల్లి రెడ్డి, తులసి పాల్గొన్నారు.

శ్రీ గాయత్రీ దేవిగా దుర్గమ్మ

రెండో రోజు నామమాత్రంగా యాత్రికులు - స్వచ్ఛంద సంస్థల సేవలు

ఏర్పాట్లను పర్యవేక్షించిన అధికారులు - దుర్గమ్మను దర్శించుకున్న పలువురు ప్రముఖులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ అమ్మవారి దసరా మహోత్సవాలు రెండో రోజు సోమవారం అమ్మవారు శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో దర్శనమిచ్చింది. రెండో రోజు సోమవారం తెల్లవారుజాము 4 గంటల నుంచే దుర్గమ్మను దర్శించుకునేందుకు దేవాలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే నేడు భక్తుల సంఖ్య నామమాత్రంగానే కనిపించింది. ఉదయం కంటే సాయంత్రం కొద్దిగా భక్తల సంఖ్య పెరిగింది. మొత్తం మీద నేడు సుమారు 40 వేల మంది వరకూ శ్రీ గాయత్రీ దేవి రూపంలో దుర్గమ్మను దర్శించుకున్నట్లు దేవస్థాన అధికారులు చెబుతున్నారు. మొదటిరోజు ఆదివారం కావటంతో అధిక సంఖ్యలో పోటెత్తిన యాత్రికులు నేడు ఆ సంఖ్యలో సగం మంది కూడా వచ్చిన పరిస్థితి కనిపించలేదు. రూ. 500ల టిక్కెట్ల క్యూ లైనులో కూడా కొద్దిమంది మాత్రమే దర్శనానికి విచ్చేశారు. యాత్రికుల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ పోలీసులు ఓవరాక్షన్ ప్రదర్శిస్తూనే ఉన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు, నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా, డిసిపి విశాల్ గున్ని, ఇతర అధికారులు, దేవాలయ ఇఓ కెఎస్ రామారావు, చైర్మన్ కర్నాటి రాంబాబు దేవాలయ ప్రాంగణంలో తిరుగుతూ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

దసరా ఉత్సవాల రెండో రోజు సోమవారం అమ్మవారు శ్రీ గాయత్రీ దేవి అవతారంలో యాత్రికులకు దర్శనం ఇచ్చారు. ఈ నేపథ్యంలో దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి బి. శివ శంకర్, పిఎండి కోర్టు జడ్జి రమణా రెడ్డి, హైకోరు రిజిస్ట్రార్ వెణుగోపాల్, హైకోర్టు న్యాయమూర్తి టి. మల్లికార్జున్‌రావులు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం అనంతరం ప్రసాదం పంపిణీ చేశారు.

దసరా శరన్నవరాత్రుల సందర్భంగా స్థానిక చిట్టినగర్‌లోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు దసరా రెండో రోజైన సోమవారం శ్రీ బాలా త్రిపుర సుందరీదేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు . దసరా ఉత్సవాలను పురస్కరించుకొని తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు, ముఖ్యంగా మహిళలు శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. విజయవాడ పశ్చిమ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనగరాల సీతారామస్వామి శ్రీమహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం కమిటీ అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు, కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్ళా శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులు బెవర సూర్యనారాయణ మాట్లాడుతూ అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేస్తున్న వేలాదిమంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిత్యం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ప్రతినిత్యం దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కళావేదికపై పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. కాగా కళా వేదికపై సుకాసి విజయలక్ష్మి శిష్య బందం ప్రదర్శించిన నత్యాలు భక్తులను అలరించాయి. దేవస్థానంలో దసరా ఉత్సవాల కార్యక్రమంలో దేవస్థానం పాలక మండలి సహాయ కార్యదర్శి పొట్నూరి దుర్గాప్రసాద్ , ఆర్గనైజింగ్ సెక్రటరీ కొరగంజి భాస్కరరావు ,కార్యవర్గ సభ్యులు పోతిన బేసికంటేశ్వరుడు, మజ్జి ఈశ్వరరావు, మజ్జి శ్రీనివాసరావు, కామందుల నరసింహారావు, పోతిన వెంకట ధర్మారావు, బంక హనుమంతరావు, బెవర సాయి సుధాకర్ పాల్గొన్నారు.

భక్తులకు ప్రసాదాల పంపిణీ

స్థానిక చిట్టినగర్ శ్రీమహాలక్ష్మి దేవస్థానం ఎదురుగా దేవీ నవరాత్రుల సందర్భంగా సోమవారం జనసేన నగర అధ్యక్షులు పోతిన మహేష్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. సుమారు 500 మంది భక్తులకు పులిహోర ప్రసాదాన్ని అందచేసారు. ఈ కార్యక్రమంలో నగరాల దేవస్థానం కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్ళా శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షులు పోతిన బేసికంఠేశ్వరుడు, కొరగంజి భాస్కరరావు, బెవర శ్రీనివాసరావు, పోతిన వెంకట ధర్మారావు, టిడిపి నాయకులు భోగవల్లి నాగు, జనసేన 48వ డివిజన్ అధ్యక్షులు కొరగంజి వెంకటరమణ, వేవిన నాగరాజు,పిళ్లా రవి, సాబింకర్ నరేష్, నోచర్ల పవన్‌కల్యాణ్,పులిచేరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సామాన్య భక్తుల దర్శనానికి ప్రాధాన్యత : దేవాదాయ శాఖ మంత్రి కొట్టు

శరన్నవరాత్రి ఉత్సవాలలో తొలిరోజు గుర్తించిన లోపాలను సరిదిద్దడంతో పాటు సామాన్య భక్తులు దర్శనం కోసం వచ్చే క్రమంలో ఎదురవుతున్న సమస్యలను సైతం చక్కదిద్దినట్లు దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. సోమవారం మంత్రి కొండ కింది నుంచి క్యూలైన్లను పరిశీలించారు. ఏ యే ప్రాంతాల్లో భక్తులు ఇబ్బంది పడుతున్నారో గుర్తించి తక్షణమే ఆయా ఇబ్బందులను చక్కదిద్దాలని సిబ్బందికి ఆదేశించారు. ఇబ్బందులను సరి చేసిన అనంతరం తిరిగి మళ్లీ పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా దర్శన భాగ్యం కల్పించాలన్న లక్ష్యం మేరకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు. ఎక్కడైనా భక్తులకు ఇబ్బంది కలిగితే అధికారులు వేగంగా స్పందించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఇంత పెద్ద కార్యక్రమంలో చిన్న చిన్న ఇబ్బందులు తలెత్తడం సహజమైనప్పటికీ, అటువంటి సమస్యలు కూడా తలెత్తకుండా ఉద్యోగులు నిబద్ధతతో విధులు నిర్వహించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. నవరాత్రి ఉత్సవాలు ముగిసే వరకు ఏ భక్తుడి నుంచి ఎటువంటి ఫిర్యాదు రాకుండా తాను కూడా నిరంతరం పర్యవేక్షిస్తానన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న ఏ శాఖ ఉద్యోగులైనా ఉపేక్షించబోమని కఠినంగా హెచ్చరించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శన భాగ్యం కోసం వస్తున్న భక్తులకు ఏ అంశంలోనూ ఇబ్బందులు కలగకుండా సంతప్తికరమైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని గుర్తు చేశారు. ముఖ్యంగా అమ్మవారికి నైవేద్యం సమర్పించే సమయంలో మాత్రం భక్తులు సహనంతో ఉండాలని కోరారు. అటువంటి సమయాలలో దర్శనంలో కొంత ఎక్కువ సమయం వేచి ఉండటం తప్పదని వివరించారు. అంతకుముందు దేవస్థానం కార్య నిర్వహణ అధికారి కె. ఎస్. రామరావు, దేవదాయ శాఖ, పోలీస్ శాఖ ఉన్నతాధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు.

పెనుగంచిప్రోలులో...

పెనుగంచిప్రోలు : స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న శ్రీ దేవీ శరన్నవరాత్రులు మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తూర్పు బజార్ శ్రీ దుర్గా మల్లేశ్వర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దసరా నవరాత్రుల్లో అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించి ప్రత్యేకమైన పూజలు నిర్వహించారు. మండపం వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో బతుకమ్మ లతో ఆట పాటలు ఆడారు.

నేడు శ్రీ అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ

దసరా ఉత్సవాలు మూడో రోజు 17వ తేదీ మంగళవారం దుర్గమ్మ శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనుంది.

తొలిరోజు రూ. 41.60 లక్షల ఆదాయం

విజయవాడ అర్బన్ : గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం శరన్నవరాత్రి ఉత్సవాల తొలిరోజు భారీ సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనం కోసం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.ఎస్.రామారావు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన ఇంద్రకీలాద్రి మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. తొలిరోజు ఆదివారం దాదాపు 95 వేల మంది భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కలిగిందని వివరించారు. తొలి రోజు వివిధ దర్శన టికెట్లు, ఆర్జిత సేవలు, లడ్డు ప్రసాదం విక్రయాలు తదితరాల ద్వారా రూ.41,60,675 ఆదాయం భక్తుల ద్వారా సమకూరినట్లు వెల్లడించారు. సాయంత్రం ఐదు గంటల నాటికి చూస్తే భక్తుల ద్వారా రూ. 20,20,223 ఆదాయం లభించినట్లు వెల్లడించారు. 500 రూపాయల టికెట్లు 1400 విక్రయం ద్వారా రూ. 7 లక్షలు, 300 రూపాయల టికెట్లు 950 విక్రయం ద్వారా రూ.2,85,000, వంద రూపాయల టికెట్లు 2000 విక్రయం ద్వారా రెండు లక్షల రూపాయలు లభించినట్లు వివరించారు. పరోక్ష ప్రత్యేక కుంకుమార్చన ద్వారా 33 వేల రూపాయలు ఆదాయం లభించినట్లు తెలిపారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం చైర్మన్ కర్నాటి రాంబాబు మాట్లాడుతూ అత్యధిక భక్తులు వస్తారని ముందే ఊహించామని అందుకు తగినట్లుగా ఏర్పాటు చేశామని చిన్నచిన్న లోపాలు గుర్తించి వాటిని వెంటనే సరి చేశామని తెలిపారు. గతేడాది తొలి రోజు భక్తుల ద్వారా 26 లక్షల ఆదాయం లభిస్తే ఈసారి తొలిరోజు ఆదాయం 40 లక్షలకు చేరడం ఇందుకు నిదర్శనం అని వివరించారు. 500 రూపాయల క్యూలైన్‌కు సంబంధించిన లోపాలను వెంటనే సరిదిద్దినట్లు వెల్లడించారు. వివిధ స్వచ్ఛంద సంస్థల వాలంటీర్లు కూడా విశేష సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. తొలి రోజు ఎంత మంది భక్తులు వచ్చినా అమ్మవారి ఆశీస్సులు లభించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.



ప్రసాదాలు పంపిణీ చేస్తున్న మహాలక్ష్మి దేవస్థానం కమిటీ



ఆదాయ వివరాలు చెబుతున్న ఆలయ ఇఒ చైర్మన్‌లు



చిట్టినగర్ అమ్మవారి దేవాలయానికి విచ్చేసిన ఎంఎల్‌ఎ వెలంపల్లి, మేయర్‌తో కమిటీ సభ్యులు



దేవాలయం మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

---

32 వ డివిజన్‌లో ఎంఎల్‌ఎ పర్యటన



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - విజయవాడ : స్థానిక 32 వ డివిజన్ 231 వ వార్డు సచివాలయ పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కోఆప్షన్ సభ్యులు గుండె సుభాషిణితో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు పర్యటించారు. తొలుత డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి.. పర్యటన ప్రారంభించారు. ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు సిఎం రాసిన లేఖలను అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలపై ఆరా తీసిన ఆయన.. నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులకు సూచనలు చేశారు. డొంకరోడ్డు వెంబడి సైడ్ కాలువపై సిమెంట్ బిల్లలు ఏర్పాటుకు రూ. 4 లక్షల నిధులు మంజూరు కాగా.. కొద్దిరోజులలో పనులు పూర్తి చేస్తామని తెలియజేశారు. మరోవైపు పదేళ్ల కాలపరిమితి దాటిన ఇళ్ల పట్టాలకు జీవో నెం. 55 ద్వారా రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే అర్బన్ ల్యాండ్ సీలింగ్ జీవో 84 ప్రకారం 150 గజాల లోపు ఉచితంగా రెగ్యులరైజేషన్ చేయడం జరుగుతుందన్నారు. పర్యటనలో భాగంగా పలు కుటుంబాలకు మంజూరైన నూతన రేషన్ కార్డులను ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. ఈకార్యక్రమంలో నాయకులు గుండె సుందర్ పాల్, ఒగ్గు గవాస్కర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జనరిక్ మెడికల్ షాపు ప్రారంభం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలోని గాంధీ సెంటర్ వద్ద ఎన్జీవోస్ హోమ్ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అను జనరిక్ మెడికల్ షాప్‌ను సోమవారం శాసనమండలి సభ్యులు మొండితోక అరుణ్ కుమార్ ప్రారంభిం చారు. నిర్వాహకులు గొట్టి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ తానూరి రాములకు శుభాకాంక్షలు తెలిపారు.



మెడికల్ షాపు ప్రారంభిస్తున్న ఎంఎల్‌సి

హ్యాండ్‌వాష్ డేపై అవగాహన

ప్రజాశక్తి - కంచికచర్ల : చేతుల పరిశుభ్రత పాటించటం వల్ల అంటురోగాల బారి నుండి కాపాడుకోవచ్చని వెలుగు ఎపిఎం భాస్కరరావు సూచించారు. వరల్డ్ హ్యాండ్ వాష్ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక వెలుగు కార్యక్రమంలో డ్వాక్రా మహిళలకు హ్యాండ్ వాష్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరచేతులు శుభ్రంగానే ఉన్నట్లు కనిపించినా కోటానుకోట్ల సూక్ష్మజీవులు ఉన్నాయనే విషయాన్ని ఊహించలేని, ప్రతిరోజూ భోజనం చేయడానికి ముందు, మల విసర్జనకు వెళ్లొచ్చిన తర్వాత చేతుల్ని శుభ్రపర్చు కోవడం మనల్ని ఎన్నో ఆరోగ్యాల బారి నుంచి బయటపడవచ్చున్నారు. అనంతరం హ్యాండ్ వాష్ చేస్తూ ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు పద్మావతి, మహిళా మార్ట్ అధ్యక్షురాలు ముత్యాల రోజరమణి సెక్రెటరీ పుల్లమ్మ కోశాధికారి పద్మావతి, వరలక్ష్మి బుక్ కీపర్ లు ఈఓలు సిసిలు యశోద నరసింహారావు అరుణ రమణ, అంజనీ విక్టరీ ప్రకాశ్ కుమారి పాల్గొన్నారు.

చెరువు పనుల పరిశీలన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఊర చెరువు సుందరీకరణ పనులను సోమవారం మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ జగ్గయ్యపేట పట్టణ ప్రజలకు, చుట్టు పక్కల గ్రామాల నుండి వచ్చు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించుటకు నిమిత్తం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు తెలిపారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, పిల్లలకు పెద్దలకు పార్కు వంటివి అధునాతన పద్ధతిలో నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు.

బిజెపి పాలనలో కార్పొరేట్లకు దేశం తాకట్టు

సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.రఘు



మాట్లాడుతున్న సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.రఘు

ప్రజాశక్తి-గన్నవరం: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అమ్మేసి దేశ ప్రజలను మోసం చేస్తుందని సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.రఘు విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారానికై గన్నవరం నియోజకవర్గంలో జరుగుతున్న ప్రజారక్షణ భేరి యాత్ర సోమవారం మండలంలో రెండో రోజు కొనసాగింది. చిన్న అవుటపల్లి, తెంపల్లి, బల్లిపర్రు, వీరపనేని గూడెం కొత్తగూడెం, చిక్కవరం, బీబీ గూడెం, గొల్లనపల్లి, గోపవరపు గూడెం, కొండపావులూరు, సావరగూడెం గ్రామాల్లో జరిగిన సభల్లో రఘు మాట్లాడుతూ దేశంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశాన్ని కొల్లగొట్టి, బడా కార్పొరేట్ వ్యవస్థలకు తాకట్టు పెడుతోందని విమర్శించారు. చౌకీదార్ అంటూ ప్రభుత్వ రంగ సంస్థలన్నీటిని కారు చౌకగా అమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టీవీ లక్ష్మణస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని అన్నారు. నవరత్నాల పేరుతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకునే ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో పెండింగ్లో ఉండే ప్రాజెక్టులను నిర్మించి, తాగు, సాగునీటిని అందిస్తానని అనేక మాయమాటలు చెప్పి తీరా అధికారంలోకి వచ్చాక రైతులను, ప్రజలను మోసం చేశారని అన్నారు. బిజెపితో పాటు దానిని బలపరుస్తున్న పార్టీలను ఓడించడమే ప్రజల లక్ష్యం కావాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు, ప్రజలను చైతన్యపరిచేందుకు ఈ యాత్ర సాగుతుందన్నారు. నియోజకవర్గంలో నాలుగు రోజుల పాటు యాత్రలో వివిధ అంశాలపై అధ్యయనం చేసి, పోరాటాలు నిర్వహించేందుకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, బేతా శ్రీనివాసరావు, అజ్మీర వెంకటేశ్వరరావు, ఏసుదాసు, రాంబాబు, తాత అబ్బాయి, మహేష్, మిరప నాగేశ్వరరావు, నాగరాజు, నాగలక్ష్మి, చినబాబు, వీర్రాజు, రాము, అరుణ్ పాల్గొన్నారు.

వారంలో మూడు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

అధికారులకు కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): వారంలో కనీసం మూడు రోజులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి అక్కడి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కషి చేయాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డిఆర్ఓ పి వెంకటరమణ, జిల్లా అధికారులు, క్షేత్రాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి క్షేత్ర పర్యటన, రికార్డుల నిర్వహణ, జగనన్న ఆరోగ్య సురక్ష, సాగునీరు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధులు పర్యటించినప్పుడు చాలా సమస్యలు వారి దష్టికి వస్తున్నాయని, అవి పరిష్కారం కావడం లేదని ఆదివారం జరిగిన సమీక్ష సమావేశంలో ప్రస్తావించడం జరిగిందన్నారు ఈ నేపథ్యంలో ఇకపై జిల్లా అధికారులందరూ కనీసం మూడు రోజులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. వారి పర్యటన వివరాలు సంబంధిత శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులకు ముందుగా తెలపాలన్నారు. ఏ అధికారి ఏ గ్రామంలో పర్యటించారు అక్కడి సమస్యలు వివరాలను వాట్సాప్ గ్రూప్ లో పోస్ట్ చేయాలన్నారు. కొన్ని మండలాల తహసిల్దార్లు వారి కార్యాలయంలో సరిగా రికార్డులు కానీ రికార్డు విభాగాలు గానీ నిర్వహించడం లేదని తెలుస్తోందన్నారు. ఒక వారం రోజుల లోపల వారు రికార్డులన్నీ సరైన పద్ధతిలో నిర్వహించాలని, ప్రతి ఒక్కటి జాబితా తయారుచేసి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జిల్లాలో సాగునీటిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.



కిడ్నీ బాధితురాలికి చేయూత



ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని నాల్గో డివిజన్కు చెందిన శ్రవణం వరలక్ష్మి కుమారికి జనసేన పార్టీ మచిలీపట్నం ఇంచార్జ్ బండి రామకృష్ణ రూ. 27,500 ఆర్థిక సహకారం సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో 4వ డివిజన్ కార్పొరేటర్ పినిశెట్టి నాగచాయదేవి, జనసేన నాయకులు గడ్డం రాజు, మహమ్మద్ సమీర్, కర్రి మహేష్, పినిశెట్టి వేణు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు : జోగి



ప్రజాశక్తి-గూడూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న జగనన్న పాలనలో ఎలాంటి తారతమ్యాలు లేవని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పేర్కొన్నారు. సోమవారం ఆయన పెడన నియోజకవర్గంలోని గూడూరు మండలం కోకనారాయణ పాలెం సచివాలయ పరిధిలోని వీరనాలతోట, కోకనారాయణపాలెం, అనంతపేట, దేశాయిపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా చేకూరుస్తున్న లబ్ధిని ఇంటింటికి తిరిగి గ్రామస్తులకు వివరించి చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కుల మత ప్రాంత పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలను అందిస్తున్నారని, అర్హతే ప్రామాణికమన్నారు. అనంతరం కోకనారాయణపాలెం గ్రామంలో రూ.20.80 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్ను జోగి రమేష్ ప్రారంభించారు వైయస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకం పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సంగా మధుసూదనరావు, గూడూరు జెడ్పిటీసి వేముల సురేష్ రంగబాబు, గూడూరు ఎంపిడిఓ డి సుబ్బారావు, తహసీల్దారు బివి ప్రసాద్, గ్రామ సర్పంచ్ బండి అంజలికుమారి, తలుపుల వెంకట కష్ణారావు, గొరిపర్తి రవి, పుప్పాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం



ప్రజాశక్తి-చల్లపల్లి: పేద విద్యార్థులకు ఐవీఎం సురేష్ సేవలు ప్రశంసనీయమని అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు అన్నారు. ఆదివారం చల్లపల్లి మండలం పురిటిగడ్డలో ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ 190 మంది స్కూల్ విద్యార్థులకు రూ.20 లక్షలు, ఇంటర్, డిగ్రీ, బీటెక్, బీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీ విద్యార్థులు 30 మందికి రూ.8 లక్షలు ఆర్థిక సహాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఐవీఎం డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్, డైరెక్టర్ వేములపల్లి రోజా, ట్రస్ట్ సభ్యులు పీ.రాజేష్‌బాబు పాల్గొన్నారు.

రెండో రోజుకు దేవీ శరన్నవరాత్రులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రులలో భాగంగా సోమవారం శ్రీ లలిత త్రిపుర సుందరీ దేవిగా యాత్రికులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో గుడివాడ యన్‌టిఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి శివ సుబ్రహ్మణ్యేశ్వరరావు (చంటి) దంపతులు, గుడ్లవల్లేరు వైస్ ఎంపీపీ శాయన రవికుమార్ దంపతులు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్‌బాబు, ధర్మకర్తల మండలి అధ్యక్షులు శేషం వీర వెంకట కృష్ణమూర్తి, సభ్యులు పామర్తి వెంకటస్వామి బాడిగ లీల సౌజన్య , నారేపాలెం వెంకట నిర్మల పాల్గొన్నారు. మధ్యాహ్నం శ్రీ విజయ దుర్గా భజన బృందం, నాగసాయి మహిళా భక్త సమాజం, శ్రీ కోదండ రామ భక్త బృందం భజన కార్యక్రమం, రాత్రి శ్రీ బాలా త్రిపుర సుందరి నృత్య నికేతన్ కూచిపూడి నృత్య ప్రదర్శన, శ్రీ విఘ్నేశ్వర భక్త బృందం వేమవరం వారిచే సంగీత విభావరి నిర్వహించారు. **గుడివాడ:** స్థానిక బంటుమిల్లి రోడ్‌లో వేంచేసి ఉన్న శ్రీ భీమేశ్వరస్వామి వారి దేవస్థానంలో శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలల్లో భాగంగా అమ్మవారు గాయత్రిదేవి అవతారంలో దర్శనమిచ్చారు. దేవస్థానము అభివృద్ధి కమిటి చైర్మన్ చందరాల హరిరాంబాబు, కార్యనిర్వహాణాధికారి షణ్యగం నటరాజన్, కమిటీ సభ్యుల నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక గౌరీశంకరపురంలో శ్రీ గౌరీశంకరస్వామి వారి దేవస్థానములో శ్రీ అనపూర్ణదేవిగా యాత్రికులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థానము అభివృద్ధి కమిటీ చైర్మన్ పంచకర్ల వెంకట్, సభ్యులు షణ్యగం నటరాజన్ పాల్గొన్నారు. పట్టణానికి చెందిన గానుగుల కృష్ణకిషోర్ రూ.98 వేలు విలువ చేసే వెండి తాంబూల పాత్రను స్వామివారికి కానుకగా సమర్పించారు. వైసిపి రాష్ట్ర నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్, శ్రీ భీమేశ్వరస్వామి వారి దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ చందరాల హరిరాంబాబుతో కలిసి వెండి తాంబూలా పాత్రను దేవస్థాన ఈవో నటరాజన్ షణ్ముగం, అభివద్ధి కమిటీ చైర్మన్ పంచకర్ల వెంకట్‌కు అందజేవారు. గుడివాడలోని శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో శ్రీ దేవి శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా సంతానలక్ష్మీ అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాల్లో అభివృద్ధి కమిటీ చైర్యన్ దుడ్డు చిన్నా, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ యార్లగడ్డ శ్రీనివాసరావు (వాసు) పాల్గొన్నారు. **ఉయ్యూరు:** ఉయ్యూరులో శ్రీజగదంబా సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారిని బాలా త్రిపురసుందరీ దేవిగా అలంకరించారు. **హనుమాన్‌జంక్షన్:** రంగన్నగూడెం, మల్లపల్లి, వీరవల్లి, కొత్తపల్లిలో శ్రీదేవీ శరన్నవరాత్రుల సందర్భంగా రెండో రోజు సోమవారం అమ్మవారు గాయత్రీదేవీగా దర్శనమిచ్చారు. రంగన్నగూడెంలో రాష్ట్ర సాగునీటి సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ, కసుకుర్తి అర్జునరావు, మందపాటి రాంబాబు, వేణుబాబు, వెనిగళ్ల జానశేఖర్ తదితరులు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. మల్లవల్లిలో గుడివాడకు చెందిన అక్కినేని శ్రీధర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరవల్లిలో కమిటీ సభ్యులు రావి ఈశ్వర్, కోడెబోయిన బాబి, ఆదిలక్ష్మి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


గుడివాడలో బాలత్రిపురసుందరీదేవి

గుడ్లవల్లేరులో...



రంగన్నగూడెంలో...

ఆలయాల అభివృద్ధికి విరాళం



ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం మండలంలోని గన్నవరం టౌన్ యాదవుల బజారు దగ్గర గల నూతనంగా నిర్మిస్తున్న శ్రీ కష్ణ దేవస్థానం కొరకు యాదవుల సంగం ఆలయ కమిటీ సభ్యులకు రూ.2.50 లక్షలు టిడిపి గన్నవరం నియోజకవర్గ ఇన్చార్జ్ యార్లగడ్డ వెంకట్రావు ఆదివారం రాత్రి అందజేశారు. చెంచుల కాలానికి గల శ్రీ లక్ష్మి తిరుపతమ్మ తల్లి దేవస్థానానికి రూ.2.50 లక్షలు యువ ఫ్రెండ్ సర్కిల్ ద్వారా ఆలయ కమిటీ సభ్యులకు యార్లగడ్డ తన సొంత నిధులను దేవస్థానంల కమిటీ సభ్యులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో గన్నవరం మండల అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వరావు, టౌన్ అధ్యక్షులు జాస్తి శ్రీదర్, ప్రధాన కార్యదర్శి బొడపాటి రవి, మాజీ సర్పంచ్ తులసిమోహన్ పాల్గొన్నారు.

బెరాకా మినిస్ట్రీస్ సాయం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి, విద్య, ఆరోగ్యం, ఇళ్ల నిర్మాణం రూ.5 లక్షల చెక్కులను ఇంటి సామాగ్రిని సోమవారం బెరాకా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మినిస్ట్రీ అధినేత కిరణ్ పాల్ ఆధ్వర్యంలో వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఫౌండేషన్ అధ్యక్షులు చందమామ బాబు, సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగిశెట్టి డానియల్ పాల్గొన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో హెచ్ఎం సిస్టర్ రాజకుమారి, పిఇటి అర్జా వెంకటేశ్వరరావును, కోచ్ అంకమ్మరావు

టైక్వాండోలో 'అమలి' విద్యార్థులకు బంగారు పతకాలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడ సత్యనారాయణపురంలోని అమలి ఇంగ్లీషు మీడియం హైస్కూల్ విద్యార్థులు టైక్వాండో పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. అమలి స్కూల్‌కు చెందిన విద్యార్థులు అండర్-11, అండర్ -14 విభాగాల్లో గోల్డ్, సిల్వర్ పతకాలు గెలుపొందారు. ఆ పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్-14లో ఎ.శ్రీహాస్య బంగారు పతకం, అండర్-11లో ఎ.శ్రీహిత, జి.యోగ్యశ్రీ బంగారు పతకాలు, ఎస్‌కె.అమీనబి సిల్వర్ పతకం గెలుపొందారు. చలమలశెట్టి మోక్షిత్ కన్సోలేషన్ బహుమతి సాధించాడు. గోల్డ్, సిల్వర్ పతకాలు సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచిన విద్యార్థులను, పిఇటి అర్జా వెంకటేశ్వరరావును, కోచ్ అంకమ్మరావును హెచ్ఎం సిస్టర్ రాజకుమారి అభినందించారు.

సిపిఎం బహిరంగ సభను జయప్రదం చేయండి

విస్సన్నపేట : స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం విస్సన్నపేట మండల విస్తృత సమావేశం జరిగింది. మేకల జ్ఞానరత్నం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేకల నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా విజయవాడలో జరిగే సిపిఎం బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం మండల కార్యదర్శి విస్సంపల్లి నాగరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై నిరంతరం వేస్తున్న భారాలను ఉద్యమాల ద్వారా తిప్పికొట్టాలని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కె.ధనలక్ష్మి, కె.రంగారాణి, పులిబల్ల ఏడుకొండలు, రామకష్ణ, చిట్టిబాబు, వెంకటేశ్వరరావు సత్యనారాయణ, లాలయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేకల నాగేంద్ర ప్రసాద్



సామాన్యులకు సంతృప్తికర దర్శనమే లక్ష్యం : కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : సిఫార్సులకు తావులేకుండా ప్రోటోకాల్ ప్రకారమే విఐపి దర్శనం కల్పించాలని సామాన్యులకు సైతం సంతృప్తికరంగా దుర్గమ్మ దర్శనం కల్పించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు సూచించారు. ఇంద్రకీలాద్రిపై నిర్వహిస్తున్న కనకదుర్గమ్మ శరన్నరాత్రి ఉత్సవాలలో సందర్శకులకు కల్పిస్తున్న దర్శన ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఘాట్‌రోడ్డు వద్ద నుండి కాలినడకన క్యూ లైన్‌లను పరిశీలిస్తూ కొండపైకి చేరుకుని ఆలయ ప్రాంగణంలో తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ సామాన్యులు కెనాల్ రోడ్డులోని వినాయకగుడి, కుమ్మరిపాలె సెంటర్ వైపు నుండి ఏర్పాటు చేయనున్న క్యూలైన్‌ల ద్వారా ఎంతో శ్రమకోర్చి కాలినడకన దుర్గమ్మ దర్శనానికి వస్తున్నారన్నారు. అటువంటి వారికి సంతృప్తికరంగా దర్శనం త్వరితగతిన అందించేలా చూడాల్సిన బాధ్యత అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. ప్రోటోకాల్ ప్రకారం వివిఐపిలకు, విఐపిలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక మార్గం ద్వారా దర్శనం కల్పించాలన్నారు. అనేక మంది మౌఖిక సిఫార్సులతో ఘాట్ రోడ్డు ద్వారా నేరుగా గేట్-3 వరకు చేరకోవడంతో రద్దీ ఏర్పడి సామాన్యులకు అంతరాయం కలుగుతోందని అన్నారు. సిఫార్సుల ద్వారా దుర్గమ్మ దర్శనానికి వచ్చేవారిని...సామాన్యులను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక గేట్ -1, గేట్ -3 వద్ద నుండి ప్రత్యేక క్యూ లైన్‌ల ద్వారా దర్శనం కల్పించేలా చర్యలు తీసుకుని రద్దీని నివారించాలన్నారు. దర్శనం పూర్తి చేసుకున్న అనంతరం సందర్శకులు మెట్ల మార్గం ద్వారా దిగువ చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్యూ లైన్‌లలో వేచ్చి ఉండే వారికి నిరంతరం తాగునీరు, మజ్జిగ, పాలు, పంపిణీ చేయాలన్నారు. క్యూలైన్లు, ఆలయ ప్రాంగణంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు నిర్వహించి పరిశు భ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిల్లీరావు అన్నారు. కలెక్టర్ వెంట ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ కాంతి రాణా టాటా, డిసిపి విశాల్‌గున్ని, జాయింట్ కలెక్టర డాక్టర్ పి.సంపత్‌కుమార్, సబ్ కలెక్టర్ అదితిసింగ్, ఆలయ ఈఓ కె.ఎస్ రామరావు, ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు తదితరులు ఉన్నారు.



అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

ఎంఎల్ఎ వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గం 55వ డివిజన్ కంసలిపేటలోని తమ్మిన పోతురాజు నగరపాలక సంస్థ ఎలిమెంటరీ పాఠశాలలో సోమవారం ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ జగనన్న సురక్ష శిబిరం ద్వారా 171 సచివాలయం పరిధిలో దాదాపు 600 మందికి పైగా ప్రజలు వ్యాధి నిర్ధారణ చేయించుకోవడమే కాకుండా మందులు కూడా తీసుకోవచ్చని అన్నారు. అభివద్ధిని, సంక్షేమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రెండు కళ్లుగా చూస్తున్నారని అన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష శిబిరాలకు హాజరైన వారికి వ్యాధి నిర్ధారణ అయితే వారు అనారోగ్యం పాలైనప్పుడల్లా ఉచితంగా మందులు ఇస్తారని, ఆ తర్వాత కూడా వారి దగ్గర ఉన్న ప్రధాన చికిత్స కేంద్రాలకి వెళ్లి మందులు తీసుకొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో 55వ వార్డు కార్పొరేటర్ శిరంశెట్టి పూర్ణచంద్ర రావు, జిల్లా వైద్య శాఖ అధికారి సుహాసిని, జోనల్ కమిషనర్ 1 డా.రవిచంద్ పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా ఇవిఎం, వివిప్యాడ్‌ల ఫస్ట్ లెవల్ చెకింగ్ : కలెక్టర్

ప్రజాశక్తి - భవానీపురం : ఈవీఎంలు, వివి ప్యాట్స్‌ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సి) పకడ్బంధీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అధికారులను ఆదేశించారు. గొల్లపూడి మార్కెట్ యార్డ్‌లో ఈవీఎం గోడౌన్లో ఫస్ట్ లెవెల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సి) ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం నుండి ప్రారంభమైన ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రక్రియ నవంబర్ 5వ తేదీ వరకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా పక్కాగా నిర్వహించాలన్నారు. ఈపరిశీలనలో డిఆర్‌వో ఎస్ వి.నాగేశ్వరరావు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి.వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ సిహెచ్.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



దసరా ఉత్సవాల్లో పారిశుధ్య పనుల పరిశీలన

24 గంటలూ అందుబాటులో ఉండాలని విఎంసి కమిషనర్ ఆదేశం

ప్రజాశక్తి - విజయవాడ : నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం శనీశ్వర స్వామి ఆలయం, ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగువన, విఎంసి కార్యాలయం సమీపంలోని ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన టెంట్ల వద్ద పారిశుధ్య కార్మికుల విధులను పర్యవేక్షించారు. మస్తరు విధానాన్ని తనిఖీ చేశారు. పారిశుధ్య పనులు నిర్విహించే కార్మికులు మూడు షిఫ్ట్‌ల్లో 24 గంటలూ అందుబాటులో ఉంచాలని, మరుగుదొడ్లు, ఆలయ పరిసర ప్రాంతాలు, రోడ్లు, క్యూ లైన్లు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. సిబ్బందికి సకాలంలో టిఫిన్లు, భోజన ప్యాకెట్లు అందుతున్నదీ లేనిది సిబ్బందిని అడిగితెలుసుకొన్నారు. అలాగే తాగునీరు పంపిణీ పాయింట్లను పరిశీలించి నిరంతరం క్యూలైన్లలో ఉన్న వారికి అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు.



హోల్డింగ్ ఏరియా, బస్టాండు దగ్గర ఉన్న తాత్కాలిక మొబైల్ టాయిలెట్లను పరిశీలించి పరిశుభ్రంగా మైయింటైన్ చేయాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో సబ్ కలెక్టర్ అదితి సింగ్, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, జోనల్ కమిషనర్ 1 డాక్టర్ రవిచంద్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, హెల్త్ ఆఫీసర్-3 ఇక్బాల్ హుస్సేన్, శానిటరీ ఇన్స్ పెక్టర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

సెలవుల్లో హాజరుకాకపోతే జీతం కట్

పరచుకోవాలని, అందుకే వర్క్‌షాపులు, ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని, వీటికి అందరూ తప్పకుండా హాజరు కావాలని హుకుం జారీ చేస్తున్నాయి. ఒక వేళ హాజరుకాని వారిపై చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నాయి. నెల జీతంలో పదిరోజుల పాటు కోతలు విధిస్తామని బెదిరిస్తున్నట్లు సమాచారం. దీంతో ఏమి చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ప్రైవేటు ఉపాధ్యాయులు ఉండి పోతున్నారు. అంతంత మాత్రంగా చెల్లించే జీతాల్లో కోతలు విధిస్తే ఇక ఇంటి అద్దెలు, కుటుంబ పోషణ భారం అయిపోతుందని ఆందోళన చెందుతున్నారు. దీంతో పది రోజులపాటు వచ్చిన దసరా సెలవుల్లో తమ సొంత ఊళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి పండుగ చేసుకోవచ్చునే ఆశ పడిన వారికి భంగపాటు తప్పడం లేదు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు అక్టోబరు 14 నుంచి, మిషనరీ స్కూళ్లకు అక్టోబరు 21 నుంచి అక్టోబరు 24 వరకు దసరా సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. అయితే అధికారుల ఆదేశాలను దిక్కరించి సెలవు దినమైన శనివారం కూడా మిషనరీయేతర ప్రైవేటు పాఠశాలలు తరగతులు నిర్వహించడం గమనార్హం.

కూలి గోప్యం...వసతి శూన్యం

తీసుకురాలేదనే ఆరోపణలు వస్తున్నాయి. అధికారపార్టీ అండ చూసుకొని కాంట్రాక్టర్ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నట్లు విమర్శలున్నాయి. కార్మికులకు వసతి దగ్గర నుంచి వేతనాలు, షిఫ్ట్‌ల కేటాయింపులో విఫలమైనట్లు చర్చ జరుగుతోంది. ఎంతో ఆశతో దూర ప్రాంతాల నుంచి పని కోసం వచ్చిన కార్మికులకు ఇచ్చే కూలి విషయంలో అత్యంత గోప్యత ప్రదర్శిస్తున్నట్లు తెలిసింది. ఆయా ప్రాంతాల నుంచి కార్మికులతో మాట్లాడి తీసుకొచ్చిన మధ్యవర్తులు, పని చేయించే మేస్త్రీలు, కార్మికులకు ఇచ్చే డబ్బుల విషయంలో నిబంధనలకు విరుద్ధంగా రకరకాలుగా ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిసింది. దీనిని కప్పిపుచ్చుకునేందుకు కాంట్రాక్టర్ చేయించాల్సిన పనులను విఎంసికి చెందిన కార్మికులతోనే చేయిస్తున్నట్లు తెలిసింది. ప్రధాన ఘాట్లు, ఇతర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను విఎంసి కార్మికులతో చేయిస్తున్నట్లు తెలిసింది. నగర పరిధిలో ప్రధానంగా తూర్పు నియోజకవర్గ పరిధిలోని కృష్ణలంక, తదితర ప్రాంతాల్లో ప్రతి డివిజన్ నుండి ఐదుగురు నుండి పది మంది చొప్పున పారిశుధ్య కార్మికులను దసరా ఉత్సవాల పనులకు ప్రత్యేకంగా విఎంసి అధికారులు మళ్లించారు. దీని ఫలితంగా ఆయా డివిజన్లలో కార్మికుల కొరత ఏర్పడి నగరంలోని మిగిలిన ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో పారిశుధ్య నిర్వహణ సాగడంలేదు. అంతేగాక శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లంతా కూడా దసరా ఉత్సవాల్లో పారిశుధ్య పనుల నిర్వహణకే పరిమితమయ్యారు. ఉత్సవాల్లో కేవలం పారిశుధ్య పనుల కోసం వివిధ జిల్లాల నుండి వచ్చిన కార్మికులకు విఎంసి ప్రధాన కార్యాలయ ఆవరణలోని కొత్త భవనంలో గ్రౌండ్ ఫ్లోర్ కేటాయించారు. దీనిలో కనీస సదుపాయాలు లేవు. విపరీతమైన దోమల మధ్య, ఉక్కపోతలో రాత్రి సమయల్లో నిద్రించడానికి కూడా అనుకూలంగా లేదని కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు భోజన సదుపాయం లేదని, అక్కడ ఆలయాల వద్ద ఉచిత భోజనంతో సరిపుచ్చుకుంటున్నామని కార్మికులు వాపోతున్నారు. ప్రతి ఎనిమిది గంటల చొప్పున మూడు షిఫ్ట్‌లుగా పని చేయించాల్సి ఉండగా, ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మొత్తం 12 గంటలపాటు పని చేయిస్తున్నట్లు బాధిత కార్మికులు చెబుతున్నారు. ఒక షిఫ్ట్‌లో పని చేస్తే రూ.500 నుండి రూ.600 వరకు ఇవ్వాల్సి ఉండగా, రెండు షిఫ్ట్‌లకు కలిపి కేవలం రూ.450 నుంచి రూ.500 వరకు మాత్రమే ఇస్తున్నట్లు తెలిసింది. గత రెండు రోజుల్లో తమకు భోజనం లేదని, ఇడ్లీలతోనే కాలం వెళ్లబుచ్చాల్సి వచ్చిందని పల్నాడు జిల్లా నుంచి వచ్చిన పలువురు మహిళా కార్మికులు ప్రజాశక్తికి చెప్పి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విఎంసి ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని తమకు వసతి ఏర్పాట్లతోపాటు పనికి సరిపడా కూలి ఇప్పించాలని బాధిత కార్మికులు కోరుతున్నారు.

పేదలకు వరం ఆరోగ్య సురక్ష : కలెక్టర్


తోట్లవల్లూరులో సురక్ష కిట్లు అందజేస్తున్న ఎంపి బాలశౌరి





ప్రజాశక్తి-తోట్లవల్లూరు: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. యాకమూరు గ్రామంలో సోమవారం స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, బందరు ఎంపి వల్లభనేని బాలశౌరి, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో పేదలు వైద్యానికి ఎంతో ఖర్చు చేసే వారని, రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయం గమనించి ప్రజలు ఎవరు అనారోగ్యంతో బాధపడకూడదని ప్రతి ఒక్కరి ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకునే విధంగా పెద్ద ఎత్తున జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తుందని అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 1.20 లక్షల మంది టోకెన్లు తీసుకుని ఈ శిబిరాల్లో వైద్య పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. ఈ శిబిరాల ద్వారా 161 రకాల మందులు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. బందరు ఎంపి వల్లభనేని బాలసౌరి మాట్లాడుతూ రూ.1.75 కోట్లు సిఎస్ఆర్ నిధులతో మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో స్కానింగ్ సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. మరో ఐదు కోట్ల సిఎస్ఆర్ నిధులతో ఏరియా ఆసుపత్రిలో అవసరమైన ఎక్విప్మెంట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి జొన్నల రామమోహన్‌రెడ్డి, ఆర్డీవో విజయ్‌కుమార్, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ జె.గీతాబాయి, గ్రామ సర్పంచ్ గాదే కనకదుర్గ, తాసిల్దారు కుసుమకుమారి, డిఎల్‌డిఓ నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు:** మండలంలోని కవుతరం మండల పరిషత్ మెయిన్ స్కూల్లో నిర్వహించిన శిబిరంలో 782 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఈడే వీరలక్ష్మి, కెడిసిసి బ్యాంకు అధ్యక్షులు వడ్లమూడి నాగ మోహన్ (చిన్ని), గ్రామ స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ రెహమాన్ మస్తాన్, ఎంపీడీవో దారపు శ్రీనివాస్, ఈవోపీఆర్డి దిలీప్‌కుమార్, డిప్యూటీ తాసిల్దార్ కనకదుర్గ, ఎంఈఓ గోపాలరావు, గుడ్లవల్లేరు కార్యదర్శి ఏజెయల్ నరసింహారావు పాల్గొన్నారు. **గుడివాడ:** స్థానిక ఎన్‌టిఆర్ కాలనీలోని మున్సిపల్ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను, వెంపల అప్పారావు, దుడ్డు చిన్న, జోగా నాగేశ్వరరావు, మాదాసు వెంకటలక్ష్మి పాల్గొన్నారు. **చల్లపల్లి:** వక్కలగడ్డలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వల్లూరు ఉమా, జెడ్పిసీఈవో శ్రీనివాసరావు, ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు, శీరం వెంకట సత్యనారాయణ (నాని), పీఏసీఎస్ ఛైర్మన్ హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ పాల్గొన్నారు.



నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఎపి సిపిఎస్ఇఎ కృష్ణాజిల్లా నూతన అధ్యక్ష కార్యదర్శులుగా కొక్కలిగడ్డ నాంచారయ్య, ఉల్లి దీపక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మచిలీపట్నం నగరంలోని రెవిన్యూ కళ్యాణ మండపంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఎన్నికల పరిశీలకులుగా ఉమ్మడి జిల్లా గౌరవా సలహాదారు బివి మల్లిఖార్జున్, రాష్ట్ర కార్యదర్శి అర్జా నాగరాజు, పేపేటి సత్యనారాయణ, ఎన్నికల పర్యవేక్షకులుగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సియం దాస్ వ్యవహరించారు. ఈ సందర్భంగా దాస్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఓపిఎస్ పునరుద్ధరిస్తానని హామీనిచ్చి అధికారాన్ని చేజెక్కించుకున్న తర్వాత మొహం చాటేసి ఇప్పుడు ఇంకా మోసపూరితమైన జిపిఎస్ తీసుకురావడం బాధాకరమన్నారు. ఇలాంటి ప్రభుత్వాలకి బుద్ధి చెప్పేలా చాలా రాష్ట్రాల్లో ఓట్ ఫర్ ఓపిఎస్ క్యాంపెయిన్ నడుస్తుందని, ఎవరైతే పాత పెన్షన్ విధానం పునరుద్ధరిస్తామంటారో వారికే వచ్చే ఎన్నికలతో మద్దతు ఉంటుందని దానికి సంబంధించి భవిష్యత్ కార్యాచరణకు సూచనలు ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి-ఉయ్యూరు: విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై రిలయన్స్ పెట్రోల్ బంక్ సమీపాన ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో యువకుడు మతిచెందాడు. పట్టణ పోలీసుల వివరాల ప్రకారం గూడురు మండలం రామరాజు పాలెంకు చెందిన పరసా సాయిరాం (28) రామరాజుపాలెంనుండి ద్విచక్రవాహనంపై విజయవాడ వైపు వెళుతూ రిలయన్స్ పెట్రోలు బంక్ సమీపాన అదుపు తప్పి డివైడర్ను ఢీకొని అక్కడికక్కడే మతిచెందాడు. సమాచారం అందుకున్న పట్టణ ఎస్సై జి.వాసు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సోమవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్లస్థలాలు చూపాలని ధర్నా

కంకిపాడు : ఇళ్ల స్థలాలు చూపించాలంటూ తహశీల్దార్ కార్యాలయం ముందు లబ్దిదారులు ఐద్వా ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. గొడవర్రు గ్రామంలో 46 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు కాగా వారికి స్థలాలు చూపించకుండా ప్రభుత్వం మాట దాట వేస్తుందని, సంవత్సరం నుండి అధికారులు తమ చుట్టూ తిప్పించుకుంటున్నారని లబ్దిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలని ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి బి.కీర్తి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఐద్వా కంకిపాడు మండల కార్యదర్శి జి.కుమారి, సునీత, ప్రవళిక, ప్రత్యూష, జ్యోతి, మరియమ్మ, కౌలు రైతుల సంఘం నాయకులు దాస్ తదితరులు పాల్గొన్నారు.





నిరసన దీక్షను జయప్రదం చేయండి : యుటిఎఫ్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తానని, పాత పెన్షన్‌ను పునరుద్ధరిస్తామని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామిని నేటికి అమలు చేయకుండా మాట తప్పి, మడమ తిప్పి ఉద్యోగులకు మరింత ప్రమాదకమైన జిపిఎస్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్ట డాన్ని యుటిఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని యుటిఎఫ్ కృష్ణాజిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.కనకరావు, జె.లెనిన్‌బాబు తెలిపారు. జిపిఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ, ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ పోస్టుకార్డు ఉద్యమం చేపట్టడం జరిగిందని, అదేవిధంగా ఓపిఎస్ సాధన కోసం రాష్ట్ర సంఘం పిలుపు మేరకు 19న కృష్ణాజిల్లా కార్యాలయంలో చేపట్టనున్న నిరవధిక నిరసన దీక్షలను జయప్రదం చేయాలని కోరారు.

చివరి భూములకు సాగు నీరందించాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ: దివిసీమ ప్రాంతంలో చివరి సాగు భూముల వరకు నీటి సరఫరా చేయాలని తాసిల్దార్ ఎస్ఎల్‌విఎస్ రామకృష్ణకు టిడిపి నాయకులు సోమవారం అర్జీ అందజేశారు. అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండలాలు సముద్రంనకు అతి సమీపమున గల మండలాలని, వరి సాగు తప్ప వేరే పంటలు పండే అవకాశం లేదన్నారు. బ్యారేజీ నుండి దిగువకు సాగునీరు రావాలంటే రెండు వేల క్యూసెక్కుల నీరు మెయిన్ కెనాల్ గుండా ప్రవహిస్తేనే చివరి భూములకు సాగునీరు అందే పరిస్థితి ఉంటుందన్నారు. అందువల్ల దివిసీమ రైతులు పడుతున్న బాధలను అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సాగునీరు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరీ వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు, ఘంటసాల రాజమోహనరావు, మండలి రామ్మోహనరావు, బచ్చు రఘునాథ్, లోక పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



న్యాయం కోరుతూ టిడిపి నిరసన

ప్రజాశక్తి-గన్నవరం: టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ గన్నవరం నియోజకవర్గ ఇన్చార్జ్ యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో చిన్నఆవుటపల్లిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చేతులకు నల్లరిబ్బన్‌లు కట్టుకుని నిజాయితీకి సంకెళ్లుఅంటూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వరావు పాల్గొన్నారు. **పెదపారుపూడి:** కోర్నిపాడు గ్రామంలో 'న్యాయానికి సంకెళ్లు' పేరుతో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి పామర్రు ఇంచార్జ్ వర్లకుమార్ రాజా, మండల అధ్యక్షులు చలాసాని రమేష్, మసిముక్కు రాంబాబు, మోచర్ల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. **హనుమాన్‌జంక్షన్:** వీరవల్లి పోలీస్టేషన్లో యువగళం పాదయాత్ర సందర్భంగా అరెస్టయిన నేతలను గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి శ్రేణులతో కవ్వింపు చర్యలు చేసిన వారిపై ఇంత వరకూ చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల గోపాలకృష్ణ, ముళ్లపూడి రమేష్ చౌదరి, మండాది రవీంద్ర, పుసులూరి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


గన్నవరంలో...

మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అరెస్టు


ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ టీడీపీ బీసీ ఫెడరేషన్ అధ్యక్షునిగా రాజమండ్రి సెంట్రల్ జైలు ముట్టడికి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారన్న సమాచారం మేరకు పోలీసులు రవీంద్రని అరెస్ట్ చేశారు. పోలీసుల అక్రమ నిర్భంధాన్ని నిరసిస్తూ మచిలీపట్నంలో తన ఇంటి ముందు కూర్చుని నిరసనకు దిగారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ చలో బీసీ రాజమండ్రి కార్యక్రమం పిలుపు తాను ఇవ్వకపోయినా సోమవారం ఉదయం నుండి తనను వెంటాడుతూ అక్రమంగా అరెస్ట్ చేయడానికి రావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. అధికార పార్టీకి బీసీలంటే అసలు గిట్టదన్నారు. కొల్లు రవీంద్ర అక్రమ అరెస్ట్‌ను అడ్డుకునేందుకు పార్టీ శ్రేణులు రవీంద్ర ఇంటికి చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పోలీసులు చర్యలను ఖండించారు. అయినా పోలీసులు రవీంద్రను అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించడంతో తోపులాట చోటుచేసుకుంది. పోలీసుల తోపులాటలో కార్పొరేటర్ దేవరపల్లి అనిత స్పృహ తప్పి పడిపోయారు. అనంతరం ఎట్టకేలకు రవీంద్రను అరెస్ట్ చేసి నాగాయలంక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. **అవనిగడ్డ:** రవీంద్రకు మద్దతుగా వెళ్లిన టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మండల వెంకటరావుని పోలీసులు అరెస్టు చేసి రహస్య ప్రదేశానికి తీసుకెళ్లారు. దీంతో టిడిపి శ్రేణులు ఆందోళన చేపట్టాయి. **ఉయ్యూరు:** కొల్లు రవీంద్ర చలో రాజమహేంద్రవరం పిలుపుమేరకు ఆ కార్యక్రమానికి హాజరు కాకుండా ఉయ్యూరులో పార్టీ బీసీ నాయకులకు సోమవారం పోలీసులు నోటీసులు ఇచ్చి గృహ నిర్భందం చేశారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు వద్ద నారా భువనేశ్వరికి సంఘీభావం తెలిపేందుకు వెళ్లనీయకుండా పార్టీ నియోజకవర్గ బీసీసెల్ ఉపాధ్యక్షుడు ఈడే అంజిబాబుకు పట్టణ పోలీసులు నోటీసులు జారీ చేశారు.


మచిలీపట్నంలో నిరసన తెలుపుతున్న కొల్లు రవీంద్ర



మోదుమూడిలో గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి-అవనిగడ్డ: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికి పెద్దన్న పాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు తెలిపారు. మండల పరిధిలోని మోదుమూడి గ్రామ సచివాలయం పరిధిలోని రామచంద్రపురం, వల్లంద పాలెం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు ప్రతి ఇంటికి వెళ్లి గత నాలుగేళ్లుగా జగనన్న ప్రభుత్వం చేపట్టిన అభివద్ధిని సంక్షేమ కార్యక్రమాలను లబ్ధిదారులకు వివరించారు. వారి క్షేమాలను అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతిదేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, రేపల్లె శ్రీనివాసరావు, సింహాద్రి వికాస్‌బాబు, గ్రామ సర్పంచ్ వాకా రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సెలవుల్లో పాఠశాలలు తెరిస్తే చర్యలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఈ నెల 14 నుండి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన దసరా సెలవుల్లో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలో గల అన్ని యాజమాన్యాల పాఠశాలలు ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలను అనుసరించి తెరవడానికి వీలులేదని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో సీతారాం మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలకు వర్క్‌షాపులు, సిలబస్ పూర్తి కాలేదని నెపాలుతో, పదో తరగతి ప్రత్యేక తరగతులు వంటివి నిర్వహిస్తున్నట్టు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ దష్టికొస్తే అటువంటి పాఠశాలల గుర్తింపును రద్దు చేయడమే కాకుండా క్రిమినల్ చర్యలు చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసులు చేస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నేరుగా ఫిర్యాదులను మండల, జిల్లా విద్యా శాఖాధికారులతో పాటు రాష్ట్ర విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ 0863 -2444270,ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సెల్ నెంబర్ 9013133636 అలాగే 1098 చైల్డ్‌లైన్‌కు, 1092 కాల్ సెంటర్‌తో పాటు secy.se.edn@gmail.com, apscpcr2018@gmail. com దష్టికి ఫిర్యాదులు అందిస్తే త్వరిత గతిన స్పందించి ఆయా యాజమాన్యాలపై చర్యలకు సిఫారసులు చేయనున్నట్టు సీతారాం తెలిపారు.

ఉత్సాహంగా 18వ జూనియర్ నేషనల్ సాఫ్ట్ టెన్నిస్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : 18వ సాఫ్ట్ టెన్నిస్ జూనియర్ నేషనల్స్ పోటీలు ప్రస్తుతం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ (ఐజీఎంసీ) స్టేడియంలో అత్యంత ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఈవెంట్ ఐదు రోజుల పాటు కొనసాగుతుంది మరియు బాలికల విభాగంలో టీమ్ ఈవెంట్ ఇప్పటికే సోమవారం ముగిసింది. అయితే బాలుర కేటగిరీ మ్యాచ్‌లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఫైనల్ మ్యాచ్ అక్టోబర్ 17న (మంగళవారం) జరుగుతుంది. అయితే, వ్యక్తిగత, డబుల్స్ మిక్స్‌డ్ కేటగిరీ మ్యాచ్‌లు కొనసాగుతుండగా, మ్యాచ్‌లు రెండు, మూడో రౌండ్‌లకు చేరుకున్నాయి. బాలికల విభాగంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర జట్టును 2-0 సెట్లలో ఓడించి తమిళనాడు జట్టు చాంపియన్‌గా నిలిచింది. అంతకు ముందు సెమీఫైనల్లో తమిళనాడు జట్టు కర్ణాటకపై 2-0 సెట్ల తేడాతో గెలుపొందగా, ఛత్తీస్‌గఢ్ జట్టు ఉత్తరప్రదేశ్‌పై 2-1 సెట్ల తేడాతో విజయం సాధించి ఫైనల్స్‌లోకి ప్రవేశించాయి. టోర్నీ క్వార్టర్ ఫైనల్లో ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టు 2-1 సెట్ల తేడాతో కర్ణాటక జట్టు చేతిలో ఓడిపోయింది. కాగా, తమిళనాడు జట్టు 2-0తో జార్ఖండ్‌పై, ఛత్తీస్‌గఢ్ 2-0తో మహారాష్ట్రపై, ఉత్తరప్రదేశ్ 2-1 సెట్ల తేడాతో హర్యానాపై విజయం సాధించాయి. బాలుర విభాగంలో మధ్యప్రదేశ్, హర్యానా రాష్ట్రాలు ఫైనల్స్‌లోకి ప్రవేశించాయి. మంగళవారం ఫైనల్ మ్యాచ్ జరగనుంది. సెమీ ఫైనల్ మ్యాచ్‌ల్లో మధ్యప్రదేశ్ 2-0తో గుజరాత్‌పై, హర్యానా వరుసగా 2-1 సెట్ల తేడాతో తమిళనాడుపై గెలిచి ఫైనల్స్‌లోకి ప్రవేశించాయి. దురదష్టవశాత్తు, ఆతిథ్య ఆంధ్రప్రదేశ్ బాలుర జట్టు క్వార్టర్ ఫైనల్లో తమిళనాడుతో 2-1 సెట్ల తేడాతో ఓడిపోవడంతో తమ అవకాశాన్ని కోల్పోయింది.



టెన్నిస్ ఆడుతున్న క్రీడాకారులు



టెన్నిస్ ఆడుతున్న క్రాడాకారుడు

టీమ్ ఈవెంట్ ఫలితాలు

బాలికలు : ఫైనల్స్: తమిళనాడు ఛత్తీస్‌గఢ్‌పై, 2-0, సెమీ-ఫైనల్స్: తమిళనాడుపై కర్ణాటక, 2-0తో, ఛత్తీస్‌గఢ్ ఉత్తరప్రదేశ్‌పై, 2-1, క్వార్టర్-ఫైనల్స్: తమిళనాడుపై జార్ఖండ్, 2-0, కర్ణాటకపై ఆంధ్రప్రదేశ్, 2-1తో ఛత్తీస్‌గఢ్ మహారాష్ట్రపై, 2-0తో, ఉత్తరప్రదేశ్ 2-1తో హర్యానాపై విజయం సాధించింది.

బాలుర : సెమీఫైనల్స్: మధ్యప్రదేశ్ గుజరాత్, 2-0, హర్యానా, తమిళనాడు, 2-1, క్వార్టర్ ఫైనల్: గుజరాత్, 2-1తో పంజాబ్, మధ్యప్రదేశ్, 2-0తో మహారాష్ట్ర, 2-0తో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, 2తో తమిళనాడు -1, హర్యానా 2-0తో ఢిల్లీని ఓడించింది.

నగరంలో నిషేధాజ్ఞలు అమలు

ప్రజాశక్తి - విజయవాడ : ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా నగర పోలీస్ కమీషనరేట్ పరిధిలో ఈ నెల 18 నుంచి వచ్చే డిశంబర్ 6వ తేదీ వరకు 50 రోజుల పాటు 144 (2)సి.ఆర్.పి.సి . క్రింద నిషేధాజ్ఞలు విధించడం జరిగినట్లు నగర పోలీసు కమిషనర్, మెట్రోపాలిటన్ ప్రాంత అదనపు జిల్లా మేజిస్ట్రేట్ కాంతిరాణా టాటా తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ...నిషేధాజ్ఞలు అమలులో ఉన్న సమయంలో పోలీస్ కమీషనరేట్ పరిధిలోని ఇబ్రహింపట్నం, భవానిపురం, వన్ టౌన్, టూటౌన్, ఎన్.ఎన్.పురం, ఏ.ఎస్.నగర్, నున్న, గవర్నర్ పేట, సూర్యారావు పేట, కష్ణలంక, మాచవరం, గుణదల , పటమట పోలీస్ స్టేషన్ల పరిధిలో నలుగురు లేదా అంతకుమించి ఎక్కువ మంది జనం బహిరంగ ప్రదేశాలలో గుమిగూడరాదన్నారు. కర్రలు,రాళ్ళు , యితర మారణాయుధాలు పట్టుకుని తిరగరాదన్నారు. ఈ నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోబడతాయని అన్నారు.

ఘనంగా దాండియా సంబరాలు

- అలరించిన చిన్నారుల నృత్యాలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : నగరంలోని బ్లూమింగ్‌డేల్ ఇంటర్నేషనల్ స్కూల్ నందు సోమవారం నిర్వ హించిన దాండియా సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టు కున్నాయి. దసరా నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విభిన్న సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిభించించే విధంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ హర్ సిమ్రాన్ కౌర్ కపాని తొలుత దుర్గాదేవికి ప్రత్యేక పూజలను నిర్వహించి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నేటితరం సంస్కృతి, సంప్రదాయాలను తెలియచేయాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా వివిధ పండుగలు వాటి విశిష్టతను తెలియచేసే విధంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా ఈసంప్రదాయ వస్త్రాలంకరణతో నృత్యాలను చిన్నారులు ఆకట్టుకున్నారు. సంప్రదాయ నృత్యం (దాండియా)లో విద్యార్థులు చక్కగా హావ భావాలను అలరించారు. ఈసందర్భంగా స్కూల్‌లో ఏర్పాటుచేసిన ఫుడ్ స్టాల్‌లో వివిధ సంప్రదాయక ఆహార పదార్థాలు అందరికీ అలరించాయి. ఈకార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ అట్లూరి విజయబాబు, చైర్మన్, అట్లూరి సుభాష్ పాల్గొన్నారు.



దాండియా ఆడుతున్న దృశ్యాలు

